కొత్త బడి.. పూర్తయ్యేదెన్నడు?

● పాఠశాలలో అరకొర వసతులు ● అవస్థలు పడుతున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భవనం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నిర్మాణం పనులు నత్తనడకన సాగుతూ మూడేళ్లు గడిచిపోయింది. పాఠశాల భవనం వినియోగంలోకి రాకపోవడం ప్రస్తుతం సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర వసతులు నడుమ విద్యార్థులు విద్యాభ్యాసం చేయాల్సిన పరిస్థితి నెలకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన బడి- మన ఊరు' కార్యక్రమానికి ప్రారంభించింది. జిల్లాలో పలు పాఠశాలలను ఎంపిక చేసి కొత్త భవనాల నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా పట్టణ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరయ్యాయి. అదనపు తరగతి గదుల నిర్మాణం, మూత్రశాలలు, చుట్టూ ప్రహరీగోడ, వంట గదుల నిర్మాణం, రంగులు వేయడం, వంటి పనులు చేపట్టాలి. జీ ప్లస్ వన్ పద్ధతిలో 8 గదులతో కూడిన పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ ప్రారంభంలో నిర్మాణం పనులు శరవేగంతో చేపట్టారు. దాదాపు 80% పనులు పూర్తి చేశాక...బిల్లులు రావడంలేదని, ప్రహరీ, మూత్రశాలల నిర్మాణం, రంగులు వేయడం, కరెంట్ తదితర పనులు వదిలేయడంతో పాఠశాల భవనం పనులు మధ్యలో ఆగిపోయాయి. విషయం అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి దృష్టికి వెళ్లడంతో గతేడాది నిధులు విడుదల చేయించారు. వెంటనే మిగులు పనులను పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. తర్వాత అధికారులు మిగులు పనులు ప్రారంభించినా ఇంత వరకు భవనాన్ని వినియోగంలోకి తీసుకురాలేకపోయారు. నెలలు గడుస్తున్నా పాఠశాల భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది.



అసంపూర్తిగా జహీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

గదుల కొరతతో ఇబ్బందులు

జహీరాబాద్ పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత భవనాన్ని దశాబ్దాల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాలలో 6 నుంచి 10 తరగతులు ఉండగా సుమారు 500 మంది విద్యార్థులున్నారు. సరిపడా గదులు లేక విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరగతి గదుల సమస్యను అధిగమించేందుకు కొత్తగా పాఠశాల భవనంకు నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా భవనం వినియోగంలోకి రావడంలేదు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల గదులను పూర్తి చేసి కొత్త బిల్డింగ్‌లో తరగతులు నడపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ అందజేస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: కల్హేర్ మండలం మాసానిపల్లికి చెందిన పాన్నం యాదగిరికి అత్యవసర వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల మంజూరుకు సంబంధించి ఎల్వోసీ ఉత్తర్వు జారీ అయింది. శుక్రవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బాధితుడి కుటుంబీకులకు ఎల్వోసీని అందజేశారు. మాజీ సర్పంచి గోపాల్ పాల్గొన్నారు. రాయికోడు మండలం ధర్మాపూర్ గ్రామానికి చెందిన మాణిక్ రెడ్డికి రూ.54 వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును ఖేడ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ లబ్ధిదారుడి కుటుంబీకులకు అందజేశారు. నాయకులు సాగర్ షెట్కార్, పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సేవలు అభినందనీయం



కాస్మోటిక్ కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

నారాయణఖేడ్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తెల్లవారు జామునుంచే విధుల్లో చేరి కార్మికులు అందించే సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం పారిశుద్ధ్య కార్మికులకు కాస్మోటిక్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులు ఆరోగ్యంగా ఉండేందుకు కాస్మోటిక్ కిట్లు దోహదపడతాయన్నారు. అనంతరం పలు వార్డుల్లో జరుగుతున్న పనులు, నీరు నిల్వ ఉన్నచోట్ల దోమలు ప్రబలకుండా ఆయిల్‌బాల్ వేయడం, యాంటీ లార్వా ద్రావణం పిచికారీ పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

నీటి శుద్ధి ప్లాంట్ ప్రారంభం



ప్లాంటును ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: సంస్కృతి, సంప్రదాయ విద్యతోనే సేవా కార్యక్రమాలు సాధ్యమవుతాయని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఖేడ్ శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో దాత జక్కుల యాదగిరి రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంటును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతీ శిశుమందిరాలు విద్యార్థుల్లో దేశభక్తి, ఆధ్యాత్మికత, నైతిక విలువలను పెంపొందిస్తుండటం గొప్ప విషయమన్నారు. రిటైర్డ్ హెచ్.ఎం రామకృష్ణ, పాఠశాల కమిటీ బాధ్యులు నారాయణ, వీరేశలింగం, చంద్రశేఖర్, శ్రీశైలం, జ్ఞానేశ్వర్, శివరాజ్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం



ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గుపోసి పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో శంకర్

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పనులను త్వరితగతిన కొనసాగించాలని ఎంపీడీవో శంకర్ స్పష్టం చేశారు. మండల కేంద్రమైన హత్నూరలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం శుక్రవారం ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ మాట్లాడుతూ...అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం ఇచ్చిన డిజైన్ ప్రకారం ముగ్గు పోసుకుని పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ యూసుఫ్, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేశ్, నాయకులు కిష్టయ్య, మధుసూదన్ గౌడ్, నరేందర్, సాయికుమార్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గంప జాతర

న్యాల్‌కల్(జహీరాబాద్): వర్షాలు కురవాలని కోరుతూ శుక్రవారం మండలంలోని చినిగెపల్లి వాసులు గంప జాతర కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామస్తులు భాజా భజంత్రీలతో గ్రామం నుంచి సమీపాన గల చెరువు వద్దకు గంపలతో నైవేద్యాలు తీసుకుని తరలివెళ్లారు. అక్కడ గంగా మాతకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



హత్నూర నుంచి జోగిపేట వెళ్లే ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

గుంతలమయంగా రోడ్లు

● మరమ్మతులకు నోచుకోని వైనం
● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

హత్నూర(సంగారెడ్డి): ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. మండల కేంద్రం నుంచి జోగిపేటకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. హత్నూరలో సుమారు 200 మీటర్ల వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా అధికారులు, నాయకులు ఎవరూ పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్యాల వెళ్లే ప్రధాన రహదారితో పాటు దౌల్తాబాద్ నుంచి నాగులదేవులపల్లి వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హత్నూర నుంచి నవాబుపేట వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. మల్కాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే ప్రధాన రహదారి సైతం గుంతలమయంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆ రోడ్డుపై వెళ్లాలంటే భయం



హత్నూర నుంచి సిరిపురం వరకు బైక్‌పై వెళ్లాలంటే ఎప్పుడు ఏ గుంతలో పడి ప్రమాదం సంభవిస్తోందనని భయంగా ఉంది. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– ప్రవీణ్‌గౌడ్, హత్నూర

నిధులు రాగానే మరమ్మతులు



ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే గుంతలు ఏర్పడిన రహదారులకు మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తాం.

– రవీందర్, ఆర్అండ్‌బీ, డీఈ

పుణ్యక్షేత్రాలకు బయలుదేరిన బస్సులు

నారాయణఖేడ్: రాష్ట్రంలోని 10 పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకుని వచ్చేలా ఖేడ్ నుంచి ప్రత్యేకంగా ఒక ఎక్స్‌ప్రెస్, ఒక సూపర్ డీలక్స్ బస్సు శుక్రవారం ఉదయం 8 గంటలకు ఖేడ్ నుంచి బయలుదేరాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయా బస్సులకు డ్రైవర్లు పూజలు నిర్వహించగా ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మెనేజర్ కృష్ణమూర్తి జెండా ఊపి పంపించారు. బస్సులు 36 గంటలపాటు ప్రయాణించి 10 పుణ్యక్షేత్రాలైన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామగుండం, మిడ్‌మానేరు డ్యాం, వరంగల్, సిద్దిపేట, మెదక్, ఏడుపాయలను దర్శించుకుని శనివారం సాయంత్రం తిరిగి ఖేడ్‌కు చేరుకోనున్నాయి. స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, అసిస్టెంట్ మెనేజర్ నర్సింహులు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ దశరథ్, నెహ్రూ, బీరయ్య, పాండు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



బస్సుకు పూజలు చేస్తున్న డ్రైవర్

రమణీయం.. రథోత్సవం



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పూరి జగన్నాథుని రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం రథోత్సవ వేడుకలకు పట్టణ ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్ని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు హనుమంత్ రెడ్డి, బీరప్ప యాదవ్, గోపాలమ్మ, రమణయ్య, నాయకులు వరప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ ప్లాట్లు ఇవ్వాలి

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కందిలోని సర్వే నంబర్ 656లో హెచ్ఎండీఏ లేఅవుట్ కోసం తీసుకున్న భూముల యజమానులకు ప్లాట్లను ఇవ్వాలని బాధితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం హెచ్ఎండీఏ లేఅవుట్ కోసం తమ నుంచి భూములు తీసుకుందని తెలిపారు. ఎకరాకు 600 గజాల ప్లాటును ఇస్తామని అగ్రిమెంట్ చేసుకున్న అధికారులు ఇప్పటివరకు ఇవ్వలేదని వాపోయారు. కాలయాపన చేయకుండా వెంటనే ప్లాట్లను భూములు కోల్పోయిన వారికి చేయాలని కోరారు.

ఈపీఎఫ్‌పై కార్మికులకు అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): కార్మికుల జీవితాలకు ఈపీఎఫ్ భద్రత కల్పిస్తుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీధర్‌రావు అన్నారు. శుక్రవారం బొల్లారం పారిశ్రామికవాడలో మైలాన్ పరిశ్రమ కార్మికులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. కార్మికులు ఈపీఎఫ్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. పరిశ్రమ యాజమాన్యాలు కార్మికులకు తప్పనిసరిగా ఈ పథకాన్ని వర్తింపజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధి సత్యనారాయణ, వంశీ పాల్గొన్నారు.

మతోన్మాద శక్తుల అభివృద్ధే బీజేపీ ధ్యేయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కార్పొరేట్, మతోన్మాద శక్తుల అభివృద్ధే బీజేపీ ధ్యేయమని, ప్రజా సంక్షేమం మరిచి ప్రజల మధ్య విద్వేషాలను పెంచడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం సంగారెడ్డి, మెదక్ జిల్లా నాయకత్వ స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం చుక్కా రాములు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వర్గాలకు వ్యతరేకంగా చట్టాలను రూపొందిస్తూ, కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూరేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత, గిరిజనుల మీద దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాంగపరంగా దక్కాల్సిన రిజర్వేషన్లను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, రాజయ్య, సాయిలు, రాంచందర్, నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, రేవంత్, నాగేశ్వర్ రావు, మహిపాల్, యాదగిరి పాల్గొన్నారు.



సీపీఎం జెండా ఆవిష్కరణ చేసిన సీపీఎం నాయకులు

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందాలంటే విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెహమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంగారెడ్డిలోని జిల్లా డీఈఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ...జిల్లాలో విద్యా హక్కు చట్టం అమలు చేయకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత లేని టీచర్లతో బోధన అందిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టడంతోపాటు విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్ ఫీజులు డొనేషన్లు, యూనిఫాం, షూస్, పాఠ్యపుస్తకాలు తమ తమ స్కూల్లోనే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగయ్య, కాశి,తిరుమలేష్, నరసింహులు, వెంకట్, ఎండీ షఫీ శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన నాయకులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశంను శుక్రవారం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ట్రాఫిక్ ఇబ్బందులపై సీఐకి వివరించి చర్యలు చేపట్టాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని నాయకులను సీఐ కోరారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



అరెస్టయిన కార్మికులకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్న ప్రవీణ్ కుమార్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాడుగా మారిన మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పంచాయతీ కార్మికులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించిన నేపథ్యంలో వారిని కలిసి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పంచాయతీ సిబ్బంది వేతనాలకు బడ్జెట్ కేటాయించి.. గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందిని కూడా రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. జీవోనంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్,యూనియన్ నాయకులు సంజీవ్, శేఖర్, రాములు, నగేష్, మైపాల్, యాదమ్మ, అశోక్, నర్సింలు తదితరులున్నారు.

అన్ని వర్గాలకూ వేద విద్య

నూతనంగా 35 మంది చేరిక

ఝరాసంగం(జహీరాబాద్): అన్ని వర్గాల వారికి వేద విద్య అందించడం జరుగుతుందని దత్తగిరి వైదిక ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర స్వామి అన్నారు. వైదిక విద్య నేర్చుకునేందుకు ఎంపికైన 35 మంది విద్యార్థులకు సాంప్రదాయ బద్ధంగా లింగ దీక్ష అందించి, వైదిక విద్యాసంవత్సరం ను ప్రారంభించారు. వేద విద్యను మరింత విస్తరించేందుకు మరో నాలుగు వైదిక పాఠశాలలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.



లింగ దీక్ష చేపడుతున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ **హామీల అమలులో ప్రభుత్వం విఫలం**



పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేలు, ఇన్సూరెన్స్ ఇస్తామని హామీ ఇచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా.. అమలు చేయలేదని ఇస్నాపూర్ ఆటోడ్రైవర్లు శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆటో కార్మికుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించి, తమకు ఇస్తామన్న జీవన భృతిని వెంటనే అమలు పరిచేలా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన హరీశ్‌రావు ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం తీర్చే దిశగా మీ పక్షాన పోరాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, ఆటో డ్రైవర్ పాల్గొన్నారు.

◆ **అందుబాటులో ఎరువులు**

మునిపల్లి(అందోల్): రైతులకు తగినన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దుర్గయ్య శుక్రవారం తెలిపారు. ఎరువులను నిబంధనల ప్రకారం రైతులకు పంపిణీ చేస్తున్నామని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **బస్సు సౌకర్యం కల్పించండి**

మునిపల్లి(అందోల్): సంగారెడ్డి నుంచి సదాశివపేట, బుదేరా, కంకోల్, తాటిపల్లి మీదుగా నారాయణఖేడ్ వెళ్లే బస్సును తిరిగి పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బస్సు లేకపోవడం వల్ల విధులకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బస్సును నిలిపివేయడం వల్ల సమయానికి విధులకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7.30కు నారాయణఖేడ్ వెళ్లే బస్సును తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

◆ **సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి**

ఝరాసంగం(జహీరాబాద్): ప్రజాసంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని చీలపల్లి, దేవరంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇళ్లు లేని వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, సంగ్రామ్ పాటిల్, మల్లన్న పాటిల్, వేణు గోపాల్‌రెడ్డి, ఉదయ్ శంకర్ పాటిల్, హాఫిజ్, శ్రీకాంత్‌రెడ్డి, సంగమేశ్వర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **నూతన కమిషనర్‌కు సన్మానం**



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కిషన్‌ను శుక్రవారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నగరాభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హనుమంత్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గోపాలమ్మ, చంద్రయ్య, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రపంచ గుర్తింపు సాధించిన గీతం**

పటాన్‌చెరు: యునైటెడ్ కింగ్‌డమ్ ఆధారిత ర్యాంకింగ్ ఏజెన్సీ ప్రచురించిన ప్రతిష్ఠాత్మక టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇంపాక్ట్ ర్యాంకింగ్స్-2025లో గీతం ప్రపంచ గుర్తింపును సాధించింది. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ అక్రిడిటేషన్, ర్యాంకింగ్ అండ్ ఐఈఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐక్యరాజ్య సమితి 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో గీతం ర్యాంకు సాధించడం ప్రధాన మైలు రాళ్లలో ఒకటన్నారు. నాలుగేళ్లుగా ఈ ర్యాంకింగులలో గీతం స్థిరమైన పురోగతిని ప్రదర్శిస్తోందని, 2022లో నాలుగు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల విభాగాలలో, 2023లో 8, 2024లో 12, ఈ ఏడాది 17 విభాగాలలో గీతం గణనీయాభివృద్ధిని ప్రదర్శించినట్లు తెలిపారు.

◆ **వావిలాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం**

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కమిషనర్ వెంకటరామయ్య పర్యటించారు. శుక్రవారం వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టిని తొలగింపు పనులను పరిశీలించారు. నగర పరిధిలోని వావిలాల 17,18 వార్డులో ఆర్వో ప్లాంట్ టీడీఎస్‌ను పరీక్షించారు. అనంతరం గడపగడపలో ఫీవర్ సర్వేలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎల్లమ్మ గుడి వద్ద గుంతలమయంగా మారిన రోడ్డును మరమ్మతులు చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

◆ **భూభారతి ఫిర్యాదులపై విచారణ**

– పర్వీన్ షేక్ తహసీల్దార్



హత్నూర (సంగారెడ్డి): గ్రామాలలో నిర్వహించిన భూభారతి సదస్సులలో వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు తహసీల్దార్ పర్వీన్ షేక్ పేర్కొన్నారు. హత్నూర మండలంలో భూభారతి సదస్సులలో 1,372 భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. వీటన్నిటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉచితంగా ప్రభుత్వం ఇసుకను అందించేందుకు ఆదేశాలు జారీ చేసిందని త్వరలోనే అక్రమంగా తవ్వకాలు చేసి సీజ్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తామని తెలిపారు.